# పాట్నాలో ఘనంగా “లెట్స్ ఇన్స్పైర్ బీహార్”

## 5వ స్థాపన దినోత్సవ మహాసభ

## హైదరాబాద్ వాసికి (మున్నా ) బీహార్‌లో సన్మానం






ఇది కద నిజం ,పాట్నా, మార్చి 23: “లెట్స్ ఇన్స్పైర్ బీహార్” ఉద్యమం 5వ స్థాపన దినోత్సవాన్ని ఆదివారం పాట్నాలోని బాపు ఆడిటోరియంలో “బీహార్ కల్చరల్ రినైసెన్స్ మహాసభ”గా అపూర్వ ఉత్సాహంతో నిర్వహించారు. సీనియర్ ఐపీఎస్ అధికారి వికాస్ వైభవ్ నాయకత్వంలో రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన 5,000 మందికి పైగా ప్రజలు కుల, మత, లింగ భేదాలను దాటి అభివృద్ధి చెందిన ఐక్య బీహార్ నిర్మాణానికి ప్రతిజ్ఞ చేశారు. 5,000 సీట్లు ఉన్న ఆడిటోరియం ప్రేక్షకులతో నిండిపోవడంతో అనేక మంది బయట నిలబడి కార్యక్రమాన్ని వీక్షించారు. సంప్రదాయ దీపప్రజ్వలనతో ప్రారంభమైన ఈ కార్యక్రమం ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రదర్శనలతో ఉత్సాహభరితంగా సాగింది. సభలో ప్రసంగించిన వికాస్ వైభవ్, బీహార్ పునరుజ్జీవనానికి స్పష్టమైన దిశానిర్దేశం ఇచ్చారు. “ఒకప్పుడు నాళందా, విక్రమశిల విశ్వవిద్యాలయాల ద్వారా ప్రపంచానికి జ్ఞానాన్ని అందించిన బీహార్, నేడు విద్య, ఉద్యోగాల కోసం యువతను వలస వెళ్లేలా చేస్తోంది. బీహార్ అభివృద్ధి చెందకుండా భారత్ సంపూర్ణ అభివృద్ధి సాధ్యం కాదు” అని అన్నారు. యువత తమ స్వస్థలాన్ని వదిలి వెళ్లాల్సిన పరిస్థితులు లేకుండా అవకాశాలు సృష్టించాలని ఆయన పిలుపునిచ్చారు. సభ్యత్వంలో భారీ వృద్ధి -- కొత్త లక్ష్యం గత ఏడాదిలో సభ్యత్వం 1.85 లక్షల నుంచి 3.55 లక్షలకు పెరిగిందని తెలిపారు. రాబోయే 12 నెలల్లో దీన్ని 10 లక్షలకు పెంచాలని సభలోని అందరూ ఏకగ్రీవంగా సంకల్పించారు.

ముఖ్య అతిథుల హాజరు. ఈ కార్యక్రమానికి పరమహంస స్వామి ఆగమనంద జీ మహారాజ్ మరియు భారత్ భారతి (పూణే) జాతీయ అధ్యక్షుడు వినయ్ భాయ్ పాత్రలే ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వీఐపీ హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ స్థాపకుడు, అడ్వకేట్ ఎండి జహంగీర్ (మున్నా) కూడా కార్యక్రమంలో పాల్గొని ఉద్యమానికి తన మద్దతు తెలిపారు. సాంస్కృతిక ప్రదర్శనలు -- పురస్కారాలు బేగుసరాయ్ బృందం చేసిన ఛఠ్ నృత్యం, గాయత్రి మందిర్ బృందం చేసిన యోగా ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. విద్య, వ్యాపారం, సామాజిక సేవ, మీడియా రంగాల్లో విశిష్ట సేవలందించిన వారికి “బీహార్ ప్రేరణ సమ్మాన్” పురస్కారాలు అందజేశారు. పరిపాలనలో విజయగాథలు వికాస్ వైభవ్ తన సేవా కాలంలో బగాహా, రోహ్తాస్ జిల్లాలను అభివృద్ధి దిశగా మార్చిన అనుభవాలను పంచుకున్నారు. చాణక్య, వైశాలి ప్రజాస్వామ్య సంప్రదాయాలను ఉదాహరణగా చూపిస్తూ బీహార్ మహిమ ప్రతిభ, ఐక్యతలోనే ఉందని పేర్కొన్నారు. కార్యక్రమం ముగింపులో “లెట్స్ ఇన్స్పైర్ బీహార్” పతాకం కింద బీహార్ తన పూర్వ వైభవాన్ని తిరిగి సాధించేందుకు సిద్ధమైందనే స్పష్టమైన సంకల్పంతో సభ ముగిసింది.

# అర్హులందరికీ పెన్షన్లు ఇవ్వాలి

## బీజేపీ ఆధ్వర్యంలో అసెంబ్లీ ముట్టడి విజయవంతం



ఇది కద నిజం, రంగారెడ్డి జిల్లా :రాష్ట్ర పార్టీ అధ్యక్షులు రామచంద్రరావు పిలుపు మేరకు, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పంతంగి రాజుభూపాల్ గౌడ్ నేతృత్వంలో నిర్వహించిన ‘చలో అసెంబ్లీ’ ముట్టడి కార్యక్రమం విజయవంతం అయ్యింది. అర్హులైన వారందరికీ తక్షణమే పెన్షన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా అధ్యక్షుడు రాజుభూపాల్ గౌడ్, పార్లమెంట్ కన్వీనర్ చీ. మల్లారెడ్డి, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పొన్నమోని మల్లేష్ యాదవ్, ఇతర బీజేపీ నాయకులు అసెంబ్లీలోకి చొచ్చుకుపోవడానికి ప్రయత్నించారు. ఈ క్రమంలో పోలీసులు వారిని అడ్డుకొని, అరెస్ట్ చేసి ఆసిఫ్ నగర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా పంతంగి రాజుభూపాల్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో వేలాది మంది అర్హులైన పేదలు పెన్షన్ల కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నా ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని, తక్షణమే పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిష్కరించి పెన్షన్లు అందజేయాలని డిమాండ్ చేశారు. పేదల హక్కుల కోసం బీజేపీ పోరాటం ఆగదని, అరెస్టులతో తమను భయపెట్టలేరని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సవాద విజయ్ కుమార్, హరికిషన్ జి, సందీప్ ముదిరాజ్, బండారి బాలకృష్ణ, గోదా పాండు యాదవ్, సూరెడ్డి వినయ్ రెడ్డి, పైల్వాన్ రాజ్ కుమార్, వల్లూరి శ్రీనివాస్, వంశి యాదవ్, బాతుకు శ్రీనివాస్, సంతోష్ గౌడ్, గూడూరు ఆంజనేయులు తదితరులు పాల్గొని ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో హోరెత్తించారు.

# అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

## AIYF మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి కన్యగారి నర్సింహ్మారెడ్డి

ఇది కద నిజం, రాజేంద్రనగర్: అఖిలభారత యువజన సమైక్య శాఖ రాజేంద్రనగర్ మండల సమితి ఆధ్వర్యంలో భగత్ సింగ్, రాజ్ గురు, సుకుదేవుల 95 వ వర్ధంతి సిపిఐ మండల కార్యాలయం ఏ ఆర్ దేవరాజ్ భవన్ లో జరిగిన ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా అఖిల భారత యువజన సమైక్య శాఖ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి కన్యగారి నర్సింహ్మారెడ్డి పాల్గొని భగత్ సింగ్ రాజ్ గురు సుఖదేవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి ఆయన మాట్లాడుతూ




షహీద్ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ లు దేశ స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలను పణంగా పెట్టి, ఉరికొయ్యలను సైతం లెక్కచేయకుండా బ్రిటిష్ వలస పాలకులపై వీరోచిత పోరాటం చేసి అమరులయ్యారని గుర్తుచేశారు. భవిష్యత్తు తరాలకు స్వేచ్ఛా భారతాన్ని అందించేందుకు వారు చేసిన త్యాగాలు చిరస్మరణీయమని అన్నారు. భగత్ సింగ్ కలలుగన్న సమసమాజం--- కుల, మత భేదాలు లేని, ధనిక-పేద తారతమ్యాలు లేని, అవినీతి రహిత సమాజ నిర్మాణం--- నేటికీ సాధించాల్సిన లక్ష్యమని తెలిపారు. కానీ నేటి యువత ఆ దిశగా పూర్తిగా పయనించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. యువత చెడు అలవాట్లకు, ముఖ్యంగా డ్రగ్స్ వంటి సామాజిక విపత్తులకు దూరంగా ఉండి, క్రీడలు మరియు సృజనాత్మక కార్యకలాపాల వైపు మళ్లాలని పిలుపునిచ్చారు. మతోన్మాద రాజకీయాలను సమూలంగా ఎదుర్కొని, సెక్యులర్ మరియు ప్రజాస్వామ్య విలువలను కాపాడడం ద్వారానే భగత్ సింగ్ కు నిజమైన నివాళి అర్పించినవారమవుతామని అన్నారు. కేంద్ర ప్రభుత్వం దీచీజు+ూా చట్టాన్ని తీసుకురావాలని, పాఠ్యాంశాలలో భగత్ సింగ్ జీవిత చరిత్రను రూపొందించాలని ఆయన డిమాండ్ చేశారు అఖిలభారత యువజన సమైక్య శాఖ ఆధ్వర్యంలో “డ్రగ్స్‌కు వద్దు -- స్పోర్ట్స్ ముద్దు” అనే నినాదంతో జిల్లా వ్యాప్తంగా యువజనోత్సవాల తో క్రికెట్, కబడ్డీ, వాలీబాల్ పోటీలు, వ్యాసరచన, చిత్రలేఖనం, ఉపన్యాస పోటీలు, రక్తదాన శిబిరాలు, యువ కవుల-గాయకుల సమ్మేళనం, సాంస్కృతిక కార్యక్రమాలు మరియు ప్రముఖుల సందేశాలు వంటి విభిన్న కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత యువజన సమైక్య శాఖ మండల నాయకులు పి రాణి చీ శ్రీనివాస్ డి శ్రీనివాస్ మహేందర్ గంగారం మంగ సునీత వి మల్లేష్ సిపిఐ రాజేంద్రనగర్ కార్యాలయం కార్యదర్శి జి సత్యం తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ హామీలు ఏమయ్యాయి?

## ట్యాంక్ బండ్ వద్ద భారత్ కూటమి భారీ నిరసన




ఇది కద నిజం : ప్రతి మహిళకు ఈ ఆర్థిక సంవత్సరమే నెలకు 2500 చెల్లించాలని , నిరుద్యోగులకు వెంటనే జాబ్ క్యాలెండర్ విడుదల చేసి 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలని, రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని భారత్ కూటమి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని డిమాండ్ చేసింది. ఈ బడ్జెట్ సమావేశాల్లోనే నిర్ణయం తీసుకుని, ఇందుకు అనుగుణంగా 2026-27 వార్షిక బడ్జెట్ ను సవరించాలని కూటమి ప్రభుత్వానికి సూచించింది. నెల నెలా మహిళలకు 2500 రూపాయలు ఇస్తామని చెప్పి అధికాపరంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ మూడేళ్లు అవుతున్నా చిల్లు గవ్వ కూడా మహిళలకు ఇవ్వలేదని, బడ్జెట్లో సవరణ చేసి ఈ పథకాన్ని అమలు చేయాలని కోరుతూ భారత్ కూటమి సోమవారం హైదరాబాద్లోని ట్యాంక్ బండ్ సమీపంలో ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టింది. దీనిని పోలీసులు అడ్డుకోవడంతో ఇందిరా పార్క్ వద్ద కూటమి నిరసన చేపట్టింది.

### ఇది మహిళలకు పరాభవం:

### చైర్మన్ కాసాని శ్రీనివాసరావు గౌడ

సీఎం రేవంత్ మహిళలను ఆకర్షించడానికి మోసపూరిత వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చి వాటిని అమలు చేయడం లేదని, ఇప్పటికే మూడో సంవత్సరం అవుతున్నా ఇంకా 2500 రూపాయల పథకం ప్రారంభించలేదని, మహిళలను కోటీశ్వరులను చేస్తామని చెబుతున్నా ఒక్క మహిళను కోటీశ్వరాలు చేసిన దాఖలాలు లేవని, ఈ సంవత్సరంలోనూ వారికి పరాభవమే జరిగిందని భారత్ కూటమి చైర్మన్ జై స్వరాజ్ పార్టీ అధినేత కాసాని శ్రీనివాసరావు గౌడ పేర్కొన్నారు.

భారత్ కూటమి అభిప్రాయం ప్రకారం మహిళల ఆర్థిక సాధికారతే ఒక బలమైన అభివృద్ధి చెందిన సమాజానికి పునాదని, ప్రతి నెలా ?2500 అందించడం ద్వారా మహిళల దైనందిన అవసరాలను తీర్చడంలో సహాయపడటమే కాకుండా అది వారి ఆర్థిక స్వావలంబనను బలపరుస్తుందని,

కాబట్టి తెలంగాణ ప్రభుత్వం వెంటనే ఈ పథకం అమలుకు చర్యలు తీసుకోకపోతే పెద్ద ఎత్తున ఉద్యమాలకు భారత్ కూటమి ప్రజలను సిద్ధం చేస్తుందని కూటమి వైస్ చైర్మన్ వర్కర్స్ పార్టీ అధ్యక్షుడు రాయబండి పాండురంగం ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మహాలక్ష్మి పథకం అమలు చేసే తేదీని వెంటనే ప్రకటించాలని, అర్హులైన మహిళల ఖాతాల్లోకి ప్రతి నెలా ?2500 నేరుగా జమ చేయాలని, అర్హులైన ప్రతి మహిళకు ఎటువంటి ఆలస్యం చేయకుండా ఈ ప్రయోజనం అందేలా పారదర్శకమైన, సులభమైన విధానాన్ని రూపొందించాలని, అదే విధంగా దళిత బంధు పథకాన్ని అమలు చేయాలని కూటమి మరో వైస్ చైర్మన్ తెలంగాణ రిపబ్లికన్ పార్టీ అధ్యక్షుడు యాదీశ్వర్ నక్కా కోరారు. తెలంగాణ మహిళలు ఎలాంటి ప్రత్యేకమైన ఉపకారం కోరడం లేదని, ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రజాస్వామ్య హామీని కాంగ్రెస్ నిలబెట్టాలని మాత్రమే ఆశిస్తున్నారని, కూటమి కన్వీనర్ ఇంక్విలాబ్ పార్టీ అధ్యక్షుడు జానీ ఒమర్ అన్నారు. మరో కన్వీనర్ పద్మశాలి రాజ్యాధికార పార్టీ అధ్యక్షుడు అశోక్ పోషం మాట్లాడుతూ బడ్జెట్ అంతా అంకెల గారడీని, బీసీలకు బడ్జెట్ పెంచాలని అన్నారు. పీపుల్స్ ప్రొటెక్షన్ పార్టీ అధ్యక్షుడు సదానంద రెడ్డి మాట్లాడుతూ కుల రహిత సమాజ నిర్మాణం కోసం ఉపయోగపడే విధంగా బడ్జెట్ లో కేటాయింపులు ఉండాలని, ఆర్థిక రిజర్వేషన్ కల్పించాలని కోరారు.

తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి అధ్యక్షుడు గోపి మాట్లాడుతూ రజకులను ఎస్సీల్లో చేర్చాలని, పేదలు లేని సమాజం కోసం కృషి చేయాలని కోరారు. జై స్వరాజ్ పార్టీ రాష్ట్ర నాయకులు ఇంజ గణేష్, సుగూరు శ్రీనివాస్, శ్రీరాం, వర్కర్స్ పార్టీ నాయకులు మల్లాచారి, శ్రీకాంత్, ఇంక్విలాబ్ సేన పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి విజయ్ బాబు, ఇండియన్ ప్రజా కాంగ్రెస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ధశరథ్ తదితరులు మాట్లాడారు. రాజేష్ ముదిరాజ్, ఆసియా తస్లీమా, ఎ. జై కృష్ణ, పుల్లెద్దుల ఓంకార్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# భగత్ సింగ్ స్ఫూర్తితో యువత ముందుకు సాగాలి: కొన్నె లక్ష్మయ్య



ఇది కద నిజం, కుక్కునూరు: భగత్ సింగ్ స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని కుక్కునూరు మండల సీపీఐ కార్యదర్శి కొన్నె లక్ష్మయ్య పిలుపునిచ్చారు. కుక్కునూరు మండలంలో ఏఐఎస్ఎఫ్ మండల కమిటీ ఆధ్యర్యంలో సోమవారం విప్లవకారుడు భగత్ సింగ్ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక సీపీఐ పార్టీ కార్యాలయంలో భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొన్నె లక్ష్మయ్య మాట్లాడుతూ.. భగత్ సింగ్ ఆశయాలను కొనసాగించాలని, యువతలో దేశభక్తిని పెంపొందించుకోవాలని కోరారు. దేశ స్వాతంత్య సాధన కోసం బ్రిటిష్ వారితో భగత్ సింగ్, సుఖ్దేవ్,రాజ్ గురులు అనేక పోరాటాలు చేశారని, పిన్న వయసులోనే వారిని బ్రిటిష్ ప్రభుత్వం ఉరితీసిందని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి సారంగి శౌర్య, ప్రేమ కుమార్, నాగవంశీ, సాయికిరణ్, రాంచరణ్ తదితరులు పాల్గొన్నారు.


## చికిత్స పొందుతున్న ఉద్యమకారుడు కోట ప్రవీణ్‌కు ఆర్థిక సహాయం

గీసుకొండ, ఇది కద నిజం, గొర్రెకుంట గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు కోట ప్రవీణ్ కిడ్నీ వ్యాధితో ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసి వరంగల్ జిల్లా ఉద్యమకారులు ముందుకు వచ్చారు. వరంగల్ జిల్లా ఉద్యమకారుల సంఘం అధ్యక్షుడు గుర్రం రఘు ఆధ్వర్యంలో, సందేల సునీల్, మిద్దెపాక విజయ్ తదితరులు కలిసి ఆర్థిక సహాయం సేకరించారు కొంతమంది ఉద్యమకారులు ఎంజీఎం ఆసుపత్రికి వెళ్లి ప్రవీణ్‌ను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుడు, రాష్ట్ర రైతు విమోచన కమిటీ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు కూడా వచ్చి పరామర్శించి, ఫర్టిలైజర్స్ అసోసియేషన్ తరపున 38,016 ఆర్థిక సహాయాన్ని తన చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో నామీండ్ల చిన్న స్వామి, సురేందర్, ఆనందం, క్లెమెంట్ బంగారి, ప్రవీణ్, సుమన్ (మాజీ ఎంపీటీసీ), జన్ను రేణుక (మాజీ సర్పంచ్) తదితరులు పాల్గొన్నారు.



## గుడుంబా స్థావరంపై దాడి - కేసు నమోదు

గీసుకొండ: గొర్రెకుంట గ్రామ శివారులో నందనాయక్ తండాకు చెందిన భూక్యా శంకర్ (తండ్రి: సేవ) అనే వ్యక్తి ప్రభుత్వ నిషేధిత గుడుంబాను తయారు చేస్తున్నాడనే విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడి నిర్వహించారు. ఈ దాడిలో సుమారు 600 లీటర్ల గుడుంబా పానకాన్ని ధ్వంసం చేసి, 5 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, గుడుంబా వంటి అక్రమ మద్యం తయారీ, నిల్వ, రవాణా మరియు విక్రయం పూర్తిగా చట్టవిరుద్ధం. గుడుంబా సేవించడం వల్ల ప్రాణాపాయం, తీవ్రమైన ఆరోగ్య సమస్యలు, మరణాలు సంభవించే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అక్రమ మద్యం తయారీ లేదా అమ్మకాలపై సమాచారం ఉన్న వారు సమీప పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని సూచించారు.



## దివ్యాంగుల బ్యాక్ లాగ్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

ఏపీ న్యూస్,ఇది కద నిజం, : ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన అర్హులైన విభిన్న ప్రతిభావంతుల నుండి బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వివిధ శాఖలలో వివిధ కేటగిరిలకు రిజర్వు చేసిన 38 బ్యాక్ లాగ్ పోస్టులను భర్తీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన అర్హులైన విభిన్న ప్రతిభావంతులు ఈ నెల 25వ తేదీ నుండి ఏప్రిల్ 8వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తులు సమర్పించాలని వివరించారు. దరఖాస్తు చేసే అభ్యర్థి వయస్సు18 సంవత్సరాలు పైబడి ఉండాలని 2026 జూలై 1వ తేదీ నాటికి 52 సంవత్సరాలు నిండి ఉండరాదన్నారు. ఈ బ్యాక్ లాగ్ ఉద్యోగాల సూచనలు, దరఖాస్తు నమూనా ఆన్లైన్ లో దరఖాస్తు ప్రక్రియ https://gunturap.in/dw2026 వెబ్ సైట్లో చూడవచ్చని తెలిపారు. వివరాలకు 0863 2323329 ఫోన్ నంబరుకు సంప్రదించవచ్చని చెప్పారు.

